క్లుప్తంగా

పోలేరమ్మకు విశేష పూజలు



పొదలకూరు : స్థానిక వూకోటి రామయ్య శ్రామికనగర్‌లో ఉన్న పోలేరమ్మ ఆలయంలో 22వ వార్షిక వేడుకలను మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వూకోటి లక్ష్మీనారాయణ, వూకోటి సుధాకర్ ఆధ్వర్యంలో పోలేరమ్మకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులు బత్తూరు మురళి, చెంచయ్య, అంకమ్మ, కొండమ్మ కాలనీవాసులు పాల్గొన్నారు.

తీర్థయాత్రకు వెళ్లిన వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

కోవూరు: ఉత్తరాది రాష్ట్రాలకు తీర్థయాత్ర నిమిత్తం వెళ్లిన కోవూరుకు చెందిన పిచ్చుక శ్రీనివాసులు వడదెబ్బకు గురై మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు .. కోవూరులోని మైథిలి హాల్లో సుదీర్ఘకాలం ఆపరేటర్‌గా పనిచేసిన శ్రీనివాసులు ఈ నెల 5న తీర్థయాత్రకు ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లారు. అందులో భాగంగా ఈ నెల 18న ఉదయం కోల్‌కత్తాకు చేరారు. అక్కడ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో వడదెబ్బకు గురై మృతి చెందారు. మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం కోవూరుకు తీసుకొస్తున్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

మనుబోలు: రైతులకు 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఏఓ షేక్ జహీర్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలానికి 120 క్వింటాళ్ల పిల్లిపెసర్లు, 17 క్వింటాళ్ల జనుము విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. రైతులకు సబ్సిడీపై పిల్లిపెసర్లు 8 కేజీల బ్యాగును రూ.536కు, జనుములు 10 కేజీల బ్యాగును రూ.440కు అందజేస్తున్నామని చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు తమ ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకంతో సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ



సంగం : మండలంలోని దువ్వూరులో కొలువైన గంగా పార్వతి సమేత కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం చప్పరోత్సవం, రాత్రి రావణ సేవ జరిపారు. ఈ నెల 26వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా 21న గిన్నెభిక్ష, రాత్రి నందిసేవ, 22న ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి అంబారి సేవ, 23న ఉదయం కల్యాణోత్సవం, రాత్రి తీర్థవాది, పురుషామృగ వాహన సేవ, 24న ఉదయం ధ్వజావరోహణ, రాత్రి అలకలతోపు, అశ్వవాహన సేవ, 25న రాత్రి శేషవాహన సేవ, 26న రాత్రి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

మాతాపరమేశ్వరికి విశేషాలంకరణ



సంగం : స్థానిక అరుంధతీయవాడలో జరుగుతున్న మాతాపరమేశ్వరి ఉత్సవాల్లో భాగంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు వివిధ రకాల డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యాళి వాహనంపై ఆత్మారాముడు

సంగం : మండలంలోని అన్నారెడ్డిపాళెంలోని ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి యాళి వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆత్మారామస్వామిని యాళి వాహనంపై కొలువుదీర్చి విశేష పూలతో శోభాయమానంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన ఆత్మారామునికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పేద పిల్లల కార్పొరేట్ స్కూల్

మహ్మదాపురంలోని దొడ్ల శేషారెడ్డి(డీఎస్సార్) జెడ్పీ ఉన్నత పాఠశాల కార్పొరేట్ స్కూల్‌ను తలపించేలా వసతులతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తోంది. గ్రామానికి చెందిన దొడ్ల కుటుంబం సొంతూరిపై మమకారంతో గ్రామీణ ప్రాంత బాలబాలికల కోసం ఐదున్నర దశాబ్దాల క్రితమే దూరాలోచన చేసి సువిశాల భవనాలను నిర్మించారు. ఉన్నత ఆశయంతో వారు నాటిన విద్యా బీజాలు నేడు మహావృక్షాలుగా మారి ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నాయి.



మహ్మదాపురంలోని డీఎస్సార్ జెడ్పీహైస్కూల్

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురానికి చెందిన దొడ్ల కుటుంబం భూస్వామ్య కుటుంబం. ఆ కుటుంబానికి చెందిన పెద్ద కాంట్రాక్టర్‌గా పేరుగడించిన దొడ్ల సుబ్బారెడ్డి 1960 ప్రాంతంలో గ్రామంలో ఉన్నత విద్యకు బీజాలు వేశారు. గ్రామంలో ఉన్నత పాఠశాల లేక గ్రామస్తులు ప్రాథమిక విద్యతోనే సరిపెట్టుకుంటున్నారనే బాధ అందరిలో ఉండేది. ఈ విషయాన్ని సుబ్బారెడ్డి సన్నిహితుల వద్ద ప్రస్తావించి తన తండ్రి శేషారెడ్డి పేరుతో గ్రామంలోని తన సొంత మామిడితోటలో 5.5 ఎకరాల్లో హైస్కూల్ నిర్మించారు. బయటి ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సైతం ఇక్కడికి వచ్చి విద్యను అభ్యసించేందుకు 1962లో పాఠశాలకు అనుబంధంగా మరో 3 ఎకరాల్లో వసతిగృహ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్నుంచి పాఠశాల అభివృద్ధికి దొడ్ల కుటుంబం అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తోంది. పాఠశాలలో ఈ విద్యాసంవత్సరంలో 400 మంది విద్యార్థులు ఉండగా, ఆ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

కార్పొరేట్ స్థాయి విద్య

మహ్మదాపురంలోని డీఎస్సార్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కార్పొరేట్ విద్యను ప్రవేశపెట్టేందుకు ఆయన మనుమడు, దొడ్ల డెయిరీ చైర్మన్ దొడ్ల శేషారెడ్డి జెడ్పీ నుంచి అనుమతి పొందారు. దొడ్ల డెయిరీ ఆదాయం నుంచి 2 శాతం నిధులు సుమారు రూ.75 లక్షలకుపైగా పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేశారు. అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, భవనాలకు రంగులు, ల్యాబొరేటరీ గదికి మరమ్మతులు, పిల్లలకు యూనిఫామ్, ఐడీ కార్డులు, బెంచీలు, తరగతి గదులకు తలుపులు, కిటికీలు, బ్లాక్‌బోర్డ్స్, వాటర్ ట్యాంక్, బోరు నిర్మాణం తదితర పనులను చేపట్టారు. మిగిలి ఉన్న పనులను ప్రభుత్వం మనబడి నాడు–నేడు తొలివిడత కింద ఎంపిక చేసి పూర్తి చేసింది.

నూతన వసతిగృహ భవనాలు

ఆరు దశాబ్దాల నాటి దొడ్ల శంకరమ్మ హాస్టల్ భవనాన్ని కూల్చి దాని స్థానంలో కొత్త భవనాలను దొడ్ల శేషారెడ్డి నిర్మించారు. వసతిగృహ సముదాయంలోని నార్త్ బ్లాక్‌ను రూ.1.60 కోట్లు, సౌత్‌బ్లాక్‌ను రూ.1.50 కోట్లు, ఈస్ట్ బ్లాక్(మూడు ఫ్లోర్స్)ను రూ.2.50 కోట్లు వెచ్చించి నిర్మించారు. సౌత్, నార్త్ బ్లాక్ నిర్మాణాలు పూర్తి చేసుకుని విద్యార్థులు ఉంటున్నారు. ఈస్ట్ బ్లాక్ నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసేందుకు వేగంగా పనులు చేస్తున్నారు. కార్పొరేట్ స్కూల్ హాస్టళ్లకు ఏ మాత్రం తగ్గకుండా భవనాలను నిర్మించారు. వెస్ట్ బ్లాక్‌ను కూడా నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



గతేడాది నిర్మించిన నార్త్‌బ్లాక్ హాస్టల్ భవనం



నిర్మాణంలో ఉన్న ఈస్ట్ బ్లాక్ హాస్టల్ భవనం

దొడ్ల కుటుంబం చలువే



మహ్మదాపురంలో విద్యాలయాలు దొడ్ల కుటుంబం చలువే. వారు ఎక్కడ ఉన్నా గ్రామంపై ప్రేమానురాగాలను కురిపిస్తుంటారు. పాఠశాల, హాస్టళ్లను అభివృద్ధి చేయాలని పరితపిస్తుంటారు. వారి నిర్మించిన పాఠశాలలో ఎంతోమంది చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారు.

–గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పూర్వవిద్యార్థి, మహ్మదాపురం

ఈస్ట్‌బ్లాకు పనులు పూర్తి చేస్తాం



విద్యార్థుల వసతి కోసం సౌత్, నార్త్‌బ్లాకును నిర్మించాం. ఈస్ట్ బ్లాక్‌ను త్వరలో పూర్తి చేస్తాం. తర్వాత వెస్ట్ బ్లాక్ పనులను మొదలు పెడతాం. శిథిలావస్థకు చేరుకున్న వసతిగృహ భవనాలను తొలగించి పేద పిల్లలకు సౌకర్యవంతంగా నిర్మించడం జరిగింది.

– దొడ్ల శేషారెడ్డి, దాత

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు పురస్కారాలు పొందిన విద్యార్థులతో దాతలు, ఉపాధ్యాయులు

పొదలకూరు : మండలంలోని ఇనుకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను బుధవారం పంపిణీ చేశారు. ఇనుకుర్తికి చెందిన అక్కెం వెంకటరెడ్డి ఎడ్యుకేషనల్ అవార్డు పేరుతో గత ఆరేళ్లుగా ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వేయి చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది ప్రతిభకనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు పతకాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం జలజారాణి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అక్కెం వెంకటరెడ్డి కుటుంబం ఎంతో కృషి చేసిందన్నారు. ఏటా పదోతరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న అక్కెం రత్నారెడ్డి–సరస్వతమ్మ, వారి సోదరులను అభినందించారు. దాత అక్కెం రత్నారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులోనూ తమవంతు సహకారం పాఠశాల అభివృద్ధికి అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం



అవగాహన కల్పిస్తున్న సినార్డ్ ప్రతినిధులు

విడవలూరు: సేంద్రియ వ్యవసాయం లాభదాయకమని సినార్డ్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు జేపీ జవహర్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సినార్డ్ సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవల్లిక మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ విధానంలో ఎరువులు, పురుగు మందుల ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. అధిక దిగుబడుల సాధనతో లాభాలను పొందవచ్చని వివరించారు. ఏపీఓ ప్రేమ్‌కుమార్ పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, అగ్రికల్చర్ అసిస్టెట్ అరుణ, ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది సౌజన్యమ్మ, మనోజ, మైథిలి, మండల ఆర్గనైజర్ పిడుగు పద్మ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్లపై చర్యలకు డిమాండ్



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్ర విద్యార్థి సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సుమంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి దిలీప్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు పుస్తకాలు, యూనిఫామ్, తదితరాల పేరుతో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడే పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని కోరారు. ఏవీఎస్ నాయకులు అజయ్, నిఖిల్, సునయ్, షారుఖ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త వేరుశనగ రకం విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

విడవలూరు: మండలంలోని రామతీర్థంలో రైతులకు ఆత్మ సౌజన్యంతో కొత్తగా రూపొందించిన టీసీజీఎస్–1694 రకం వేరుశనగ విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. కొత్త రకం వంగడాన్ని సాగుచేసేందుకు ముందుకొచ్చిన రైతులు మట్టి వెంకయ్య, నెల్లూరు శ్రీహరి, మట్టి రవీంద్ర, నాటూరు మస్తానయ్యకు ఆత్మ డైరెక్టర్ ఎస్ దేవసేన, డిప్యూటీ డైరెక్టర్ శివనారాయణ విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన రకం పంట 105 నుంచి 110 రోజుల్లో చేతికి వస్తుందని తెలిపారు. అధిక దిగుబడులు వస్తాయని, నూనె శాతం ఎక్కువగా ఉండడం వల్ల మంచి గిట్టుబాటు ధరలు లభిస్తాయని చెప్పారు. తద్వారా రైతులు ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ పీ వెంకటకృష్ణయ్య, వీఏఏ సాయి మహేష్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



ముత్తుకూరు: స్థానిక బలిజపాళెం ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఒకటో తరగతిలో చేరిన 13 మంది చిన్నారులతో ఎంఈఓ మధుసూదన్, హేమసుందర్, హెచ్‌ఎం లలిత అక్షరాభ్యాసం చేయించారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, ఏపీసీడీఓ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు కృష్ణకుమార్, పర్వీన్ పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

పొదలకూరు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోడలు శృతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య నాయకులు అమర్తలూరు చెంచయ్య, పొట్టి సుధాకర్, మీరామధు, విజయకుమార్ పాల్గొన్నారు.

బెల్టుషాపులను తొలగించండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: టీడీపీ అధికారంలోకి వచ్చి పట్టుమని పదిరోజులు కూడా కాక ముందే ఊరురా బెల్టుషాపులు వెలుస్తున్నాయి. యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మండలంలోని మినగల్లులో బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఓ టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో మూడు బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని ఆ గ్రామ సర్పంచ్ భర్త టీడీపీ నాయకుడు రాము ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకుండా కేవలం అక్రమ సంపాదనే లక్ష్యంగా గ్రామంలో మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్టు షాపులను తొలగించకపోతే పూర్తి ఆధారాలతో కోవూరు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తామన్నారు. మద్యం అక్రమ విక్రయాలపై పోలీసులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం



మనుబోలులో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ



కొడవలూరు: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

కొడవలూరు: దోమల నివారణతో వ్యాధులను అరికట్టవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. మండలంలోని యల్లాయపాళెంలో దోమల కారణంగా వ్యాప్తి చెందే వ్యాధులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా దోమలు నివారించవచ్చన్నారు. రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు బీ మేరీహెబ్సిబా, వెల్ఫేర్‌అసిస్టెంట్ మల్లికార్జున, అంగన్‌వాడీ కార్యకర్త ఆర్ నీరజ, ఏఎన్‌ఎం సుకన్య, వీఓఏలు నీరజ, ఎస్కే బీబీజాన్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

మనుబోలు: పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని యాచవరం, వెంకన్నపాళెం అంగన్‌వాడీ కేంద్రాల్లో దోమల నివారణపై చిన్నారుల తల్లులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న చోట దోమలు వృద్ధి చెంది పలు రోగాలకు కారణమవుతాయని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో వర్షపు నీరు, మురుగు నిల్వ చేరకుండా జాగ్రత్త వహించాలన్నారు. డ్రైనేజీల్లో ఆయిల్‌బాల్స్ వేయడం, మలాథిన్‌ను పిచికారీ చేయడం ద్వారా దోమలను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, రామకృష్ణ, ఏఎన్‌ఎం సుభాషిణి, అంగన్‌వాడీ టీచర్ సుజన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పులి వాహనంపై చాముండేశ్వరిదేవి



ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో చాముండేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారి చప్పరోత్సవాన్ని నిర్వహించారు. వైశ్యులు ఉభయదాతలుగా వ్యహరించారు. రాత్రి చాముండేశ్వరిదేవిని విశేషంగా అలంకరించి పులి వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయకర్తలుగా పల్లెపాళెం వారు వ్యవహరించారు. కాగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేడుకగా ప్రసన్నాంజనేయుని గ్రామోత్సవం



కొడవలూరు: మండల కేంద్రమైన కొడవలూరులో ప్రసన్నాంజనేయస్వామి గ్రామోత్సవాన్ని బుధవారం వేడుకగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా అర్చకులు పవన్‌స్వామి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కోవూరు వెంకీ, పీ రాధాకృష్ణ, కాకాణి మురళి, మల్లెల అనిల్, గాలి ప్రసాద్, చంతాటి రవి, ఉయ్యాల నారాయణ, అరెగల సుధీర్‌బాబు, ముడి హరికృష్ణ, దుంపల కిరణ్ పాల్గొన్నారు.

వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

ఉదయగిరి : దుత్తలూరు మండలం నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలకు ఈ నెల 26న ఉదయగిరి డిపో నుంచి 25 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయగిరి డిపోలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఉదయగిరి, సీతారామపురం, బద్వేలు, పోరుమామిళ్ల నుంచి ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతో నడపనున్నట్లు తెలిపారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సిబ్బందితో సమీక్షించారు.

సికిల్‌సెల్ అనీమియా వంశపారంపర్యం



కొడవలూరు: సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన ర్యాలీ



పొదలకూరు: గిరిజనులతో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహారావు

పొదలకూరు : సికిల్‌సెల్ అనీమియా వంశపారంపర్యంగా వస్తుందని మహ్మదాపురం పీహెచ్‌సీ డాక్టర్ వీ నరసింహారావు తెలిపారు. ప్రపంచ సికిల్‌సెల్ అనీమియా దినోత్సవం సందర్భంగా మండలంలోని తిప్ప వద్ద ఉన్న గిరిజన కాలనీలో పీఎం జనజాతి ఆదివాసి న్యాయ మహాఅభియాన్‌లో భాగంగా గిరిజనులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 నుంచి 40 ఏళ్లలోపు గిరిజనులను గుర్తించి రక్త నిర్ధారణ పరీక్షలు, వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎర్ర రక్తకణాల రుగ్మత అనువంశికంగా వ్యాప్తి చెందుతుందన్నారు. ఆరోగ్యకరమైన ఎర్రరక్తకణాలు గుండ్రంగా ఉంటే, సికిల్‌సెల్ వ్యాధి సోకితే అర్ధచంద్రాకారంలో ఉంటాయన్నారు. రక్తకణాల సంఖ్య తగ్గిపోవడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన కీళ్ల నొప్పులు, తరచూ అంటువ్యాధుల బారిన పడడం, గర్భాధారణ సమయంలో సమస్యలు, అవయవ వైఫల్యం, శరీర పెరుగుదలలోని సమస్యలు సికిల్ సెల్ అనీమియా లక్షణాలని పేర్కొన్నారు. ఒక్క చుక్క రక్తంతో వ్యాధి నిర్ధారణ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆదిలక్ష్మమ్మ, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఆరోగ్యకార్యకర్తలు మహేంద్రకుమార్, పెంచలమ్మ, ఆశాకార్యర్తలు సుజాత, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన ర్యాలీ

కొడవలూరు: సికిల్ సెల్ అనీమియా నివారణ దినోత్సవం సందర్భంగా యల్లాయపాళెంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సింధు మేఘన మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వ్యాధితో ఏ ఒక్కరూ బాధ పడకూడదని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. సికిల్ సెల్ అనీమియా నివారణ మాసోత్సవం సందర్భంగా నెల రోజులపాటు గ్రామాల్లో విస్తృతంగా వైద్య సిబ్బంది పర్యటించి రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి ఎక్కువగా గిరిజనుల్లో ఉంటున్నందున తొలుత ఆ ప్రాంతాలపై దృష్టి సారించి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ విజయ, ఎస్ఎన్ ఆదిలక్ష్మి, యూడీసీ నివేదిత, హెచ్‌ఎస్ సురేంద్ర, ఏఎన్‌ఎంలు మహేశ్వరి, సుకన్య పాల్గొన్నారు.